క్లుప్తంగా

మర్యాదపూర్వకంగా..

చేజర్ల: మండల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నియమితులైన ఆర్ మస్తానయ్యను మండల బీజేపీ నేతలు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇన్‌చార్జి తహసీల్దార్‌ను శాలువాతో సన్మానించి మండలంలోని సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తల కృష్ణయ్య, రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు కుంకు బాలయ్య,కోటిరెడ్డి ఉన్నారు.

పాడి రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులు

వరికుంటపాడు: పాడి రైతులకు పశుపోషణ నిమిత్తం పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో కిసాన్ క్రెడిట్ కార్డులను అందజేస్తున్నామని పెద్దిరెడ్డిపల్లి పశు వైద్యాధికారి ఎస్వీ రాఘవేంద్రశర్మ సోమవారం తెలిపారు. కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా మార్టిగేజ్ లేకుండా రూ.1.50లక్షల వరకు, మార్టిగేజ్‌తో రూ.3లక్షల వరకు రుణాలను ఏడు శాతం వడ్డీతో పొందవచ్చని తెలిపారు. రుణాలను సకాలంలో చెల్లిస్తే 3 శాతం వడ్డీని ప్రభుత్వం తిరిగి అందజేస్తుందన్నారు. ఆసక్తి కలిగిన పాడి రైతులు రైతుసేవా కేంద్రాల్లోని పశు వైద్యసహాయకులను సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నూతన కార్యవర్గ ఎన్నిక



ఆత్మకూరు: ఆత్మకూరు డివిజన్ తెలుగునాడు విద్యుత్ ఎంప్లాయిస్ యూనియన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని సంఘ కార్యాలయంలో జిల్లా కార్యవర్గసభ్యులు ఎం రమేష్, కేవీ ఈశ్వరప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో సంఘ అధ్యక్షుడిగా ఎస్ వెంకటేశ్వర్లు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎం కొండయ్య, సలహాదారుడిగా కే సుబ్బారావును ఎన్నుకున్నారు. యూనియన్ జిల్లా, రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఎస్‌వీ ప్రసాద్, మహ్మద్‌ఆలీ పాల్గొన్నారు.

ఎంపీడీఓల బాధ్యతల స్వీకరణ



ఏఎస్‌పేట ఎంపీడీఓకు సత్కారం

అనుమసముద్రంపేట: మండల నూతన ఎంపీడీఓగా పీ ప్రసన్నకుమారి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె గతంలో మండల ఇన్‌చార్జి ఎంపీడీఓగా పనిచేస్తూ బదిలీపై కొండాపురం వెళ్లారు. మళ్లీ ఏఎస్‌పేటకు ఎంపీడీఓగా బదిలీపై వచ్చారు. నూతన ఎంపీడీఓకు మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



బాధ్యతలు స్వీకరించిన నాగేశ్వరప్రసాద్

మర్రిపాడు: మండల నూతన ఎంపీడీఓగా నాగేశ్వరప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేస్తున్న నాగమణి ముత్తుకూరుకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో ప్రకాశం జిల్లా యర్రగుంట్లలో పనిచేస్తున్న నాగేశ్వరప్రసాద్ మర్రిపాడుకు వచ్చారు. నూతన ఎంపీడీఓకు కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు.

డీటీ బాధ్యతల స్వీకరణ



మర్రిపాడు: మండల నూతన డిప్యూటీ తహసీల్దార్‌గా అనిల్ కుమార్‌యాదవ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా కలెక్టరేట్‌లో విధులు నిర్వహిస్తున్న ఆయన మర్రిపాడు డీటీగా వచ్చారు.

తహసీల్దార్ దాతృత్వం



మర్రిపాడు: బాధిత వీఆర్‌ఏ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసి తహసీల్దార్ స్వప్న తన దాతృత్వాన్ని చాటుకున్నారు. డీసీపల్లి వీఆర్‌ఏగా పనిచేస్తున్న సుబ్బులు అనారోగ్యంతో బాధపడుతుండగా, కుమారుడు దావీదు(28) విధులు నిర్వహిస్తున్నాడు. ఇటీవల దావీదు ఆకస్మికంగా మృతి చెందారు. ఈ విషయాన్ని తహసీల్దార్ స్వప్న దృష్టికి వీఆర్వో తీసుకెళ్లడంతో స్పందించారు. వీఆర్‌ఏ కుటుంబ ఖర్చుల కోసం తన సొంత నిధుల నుంచి రూ.11,116 అందజేశారు.

సమగ్ర సమాచారం అందుబాటులో ఉండాలి

ఉదయగిరి: మండలంలో పనిచేసే సీఆర్‌ఎంటీలు వారి పరిధిలోని సమగ్ర సమాచారాన్ని అందుబాటులో ఉంచుకోవాలని ఎంఈఓ–2 శ్రీనివాసులు తెలిపారు. మండల విద్యావనరుల కేంద్రంలో సీఆర్‌ఎంటీలతో సోమవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడి బయట పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలన్నారు. పదో తరగతి తప్పిన విద్యార్థులను ఓపెన్ స్కూల్లో చేర్పించాలని సూచించారు. సీఆర్‌ఎంటీలు సిద్ధయ్య, భోగ్యం శ్రీనివాసులు, మెహియుద్దీన్, ఇనయితుల్లా, మాల్యాద్రి, రమణారెడ్డి పాల్గొన్నారు.

అధికారం మనదే దున్నేయ్

- కూటమి ప్రభుత్వం వచ్చాక చెలరేగిపోతున్న తెలుగు తమ్ముళ్లు
- యథేచ్ఛగా కోట్ల విలువైన ప్రభుత్వ భూముల కబ్జా
- చోద్యం చూస్తున్న అధికారులు



కంపసముద్రంలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసిన అధికారులు (ఫైల్)

మర్రిపాడు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తెలుగు తమ్ముళ్లు చెలరేగిపోతున్నారు. అధికారం అండతో అక్రమాలకు తెగబడుతున్నారు. యథేచ్ఛగా ప్రభుత్వ భూములను ఆక్రమించి సాగుకు ఉపక్రమిస్తున్నారు. మండలంలో ప్రభుత్వ భూముల ఆక్రమణల పర్వం జోరుగా సాగుతున్నా అడ్డుకట్ట వేయాల్సిన రెవెన్యూ అధికార యంత్రాంగం చోద్యం చూస్తోంది. ఎవరైనా ఫిర్యాదు చేస్తే తప్ప ఆక్రమణదారులపై చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలో ప్రభుత్వ భూముల ఆక్రమణ యథేచ్ఛగా సాగుతోంది. భూముల ధరలకు రెక్కలు రావడంతో తెలుగు తమ్ముళ్లు గ్రామాల్లో ఎక్కడైనా ప్రభుత్వ భూమి కనిపిస్తే కబ్జా చేస్తున్నారు. రాత్రి వేళల్లో భూములను చదును చేసి సాగుకు ఉపక్రమిస్తున్నారు. నిత్యం ఏదోక గ్రామంలో జరుగుతున్న భూఆక్రమణలను ప్రజలు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకొస్తూనే ఉన్నారు. అయినా అధికారం మనదే దున్నేయ్ అన్నట్లుగా అసైన్డ్, మేత పొరంబోకు, అటవీ భూముల కబ్జాకు తెగబడుతున్నారు. అధికారుల ఉదాసీనత కారణంగానే కోట్లాది రూపాయల విలువైన భూములు ఆక్రమణదారుల చెరలో చిక్కుకుంటున్నాయి.

- మండలంలోని కదిరినేనిపల్లిలో 40 ఎకరాల మేత పొరంబోకును కొందరు ఆక్రమించారు. భూములను చదును చేసి జామాయిల్ మొక్కలను సైతం నాటారు. సింగనపల్లి, బాట గ్రామాల్లో సుమారు 30 ఎకరాల ప్రభుత్వ భూమిని రాత్రి వేళల్లో చదును చేసి ఆక్రమించేందుకు యత్నించగా మీడియా అధికారుల దృష్టికి తీసుకురావడంతో భూకబ్జా ఆగింది.
- కంపసముద్రంలో సర్వే నంబర్ 446, 447, 449లో ఉన్న సుమారు 100 ఎకరాల ప్రభుత్వ భూముల ఆక్రమణకు యత్నించగా, అధికారుల దృష్టికి రావడంతో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు.
- నందరంలో సుమారు 30 ఎకరాల భూమిని కొందరు ఆక్రమించేందుకు యత్నించారు. ఇలా నిత్యం ఏదోక గ్రామంలో భూఆక్రమణలు జరుగుతూనే ఉన్నాయి. మండలాధికారుల దృష్టికి ఎవరైనా తీసుకెళ్తేనే చర్యలు చేపడుతున్నారు. లేకుంటే మిన్నకుండిపోతుండడంతో భూ కబ్జాల పర్వం కొనసాగుతోంది. ఈ ఆక్రమణల పర్వం కొనసాగితే భవిష్యత్తులో భూ పంపిణీకి సైతం భూమి మిగలని పరిస్థితి నెలకొనే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి భూఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకుని ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

భూఆక్రమణలకు పాల్పడితే కఠిన చర్యలు

“ భూఆక్రమణలపై గ్రామ రెవెన్యూ అధికారుల ద్వారా విచారణ చేపట్టి కట్టడికి గట్టి చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటి వరకు మా దృష్టికి వచ్చిన భూఆక్రమణలపై విచారణ చేపట్టి హెచ్చరిక బోర్డులు సైతం ఏర్పాటు చేశాం. మరిన్ని గ్రామాల నుంచి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

– స్వప్న, తహసీల్దార్, మర్రిపాడు

భూముల వివరాలు సరిచేయాలని వినతి



తహసీల్దార్ సుభద్రకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

ఉదయగిరి: తమ భూములకు సంబంధించిన వివరాలను సరి చేసి ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాలని బిజ్జంపల్లి గ్రామానికి చెందిన పలువురు రైతులు తహసీల్దార్ సుభద్రకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకుడు కాకు వెంకటయ్య మాట్లాడుతూ 2003లో పలువురు లబ్ధిదారులకు ప్రభుత్వం భూములను పంపిణీ చేసిందని తెలిపారు. అప్పట్నుంచి వారు భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. భూములపై బ్యాంకుల్లో పంట రుణాలను సైతం పొంది ఉన్నారన్నారు. అయితే ప్రస్తుతం ఆ భూములకు ఆన్‌లైన్‌లో 1బీలు, అడంగల్లు రాకపోవడంతో లబ్ధిదారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను పొందలేక పోతున్నారన్నారు. ఆన్‌లైన్‌లో వివరాలు సరిచేయాలని కోరారు. తహసీల్దార్ స్పందిస్తూ పరిశీలించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

పంట కాలువల్లో పూడిక తొలగించాలని వినతి



ఇరిగేషన్ ఈఈకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

ఆత్మకూరు: ఆత్మకూరు చెరువు మూడో నంబరు తూము పరిధిలోని పంట కాలువల్లో పూడిక తొలగించాలని ఆయకట్టు రైతులు కోరారు. సోమవారం వారు ఏపీ రైతు సంఘం ఆత్మకూరు శాఖ ఆధ్వర్యంలో ఆత్మకూరు ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రేవూరు వెంకటేశ్వర్లుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. మూడో నంబరు తూము పరిధిలోని తూర్పు అన్న కాలువ, మిట్ట కాలువ, దక్షిణ కాలువల కింద సుమారు మూడు వేల ఎకరాల ఆయకట్టు ఉందని తెలిపారు. గత మూడేళ్లుగా కాలువల్లో పూడికతీత పనులు చేపట్టకపోవడంతో పూడికతో నిండి ఉన్నాయని తెలిపారు. ఈ ఏడాది తప్పని సరిగా పూడిక తొలగించాలని, లేకుంటే సాగు నీరు అందని పరిస్థితి నెలకొంటుందన్నారు. తర్వలో రబీ సీజన్ ప్రారంభమవుతున్నందున కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలని కోరారు. స్పందించిన ఈఈ వెంకటేశ్వర్లు పూడిక తీతకు చర్యలు చేపడుతామని తెలిపారు. ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణప్రసాద్, రైతులు కే వెంకటేశ్వర్లు, దోర్నాదుల నరసింహారెడ్డి, క్రాంతికుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై కలెక్టర్‌కు ఫిర్యాదు

బిట్రగుంట: బోగోలు మేజర్ పంచాయతీ ఈఓ షేక్ అబ్దుల్ జహీర్ వ్యవహారశైలిపై వార్డు సభ్యులు కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. స్థానిక సంస్థల ప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ పంచాయతీ అభివృద్ధికి కృషి చేయాల్సిన ఈఓ అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని, వార్డు సభ్యులను తప్పుడు కేసులతో వేధిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సర్పంచ్ పందిపాటి అనిత అధ్యక్షతన ఆగస్ట్ 2న జరిగిన పంచాయతీ సాధారణ సర్వసభ్య సమావేశంలో పంచాయతీ కార్యాలయంలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటాలను తొలగించడంపై అభ్యంతరం వ్యక్తం చేయగా, వెంటనే ఈవో స్పందించి ఎన్నికల నియమావళి కారణంగా గతంలో అధికారులు చిత్రపటాలను తొలగించినట్లు చెప్పడం జరిగిందన్నారు. తాను ఇటీవలే బాధ్యతలు చేపట్టానని, వెంటనే పంచాయతీ సిబ్బందికి చెప్పి వైఎస్సార్, వైఎస్ జగన్ చిత్రపటాలను కూడా ఏర్పాటు చేయించారని తెలిపారు. ఈ విషయంలో ఎటువంటి వివాదం జరగలేదన్నారు. ఆ తరువాత పంచాయతీ సమావేశం కూడా యథావిధిగా జరిగిందన్నారు. ఆ తరువాత ఈఓ బిట్రగుంట పోలీస్ స్టేషన్‌లో వార్డు సభ్యులపై తప్పుడు ఫిర్యాదు చేసి వేధిస్తున్నారని తెలిపారు. వార్డు సభ్యులైన సూరపనేని శ్రీనివాసులు, గంగపట్ల నన్నమ్మ తన విధులకు ఆటంకం కలిగించి బలవంతంగా మాజీ సీఎం వైఎస్ జగన్ చిత్రపటం ఏర్పాటు చేయించారని పోలీసులకు తప్పుడు ఫిర్యాదు చేశారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయమై పంచాయతీ సిబ్బంది, వార్డు సభ్యుల ఆధ్వర్యంలో బహిరంగ విచారణ జరిపించి తప్పుడు ఫిర్యాదు చేసిన ఈఓపై చట్టపరంగా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

104 సేవలు

వరికుంటపాడు : గణేశ్వరాపురంలో 104 వాహన సేవలను సోమవారం అందజేశారు. డాక్టర్ కరీష్మా 33 మంది రోగులను పరీక్షించి మందులు అందజేశారు.

ఏఐటీయూసీ జెండా ఆవిష్కరణ

ఉదయగిరి: స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో ఏఐటీయూసీ జెండాను ఆటో కార్మికులతో కలిసి జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్‌కిషోర్ సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని సంఘటిత, అసంఘటిత కార్మికులను కలుపుకుని ఏఐటీయూసీ బలోపేతం చేస్తామన్నారు. బస్టాండ్ సెంటర్‌లో ఆటోస్టాండ్‌ను ఏర్పాటు చేయాలని పోలీసులను కోరారు.

రేపటి నుంచి ఉపసర్పంచ్‌లకు శిక్షణ

సీతారామపురం: మండల పరిషత్ కార్యాలయంలో ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులకు సాధారణ పరిపాలనా విధానంపై బుధవారం నుంచి రెండ్రోజుల పాటు శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ భాస్కర్ సోమవారం తెలిపారు. ప్రజాప్రతినిధులందరూ శిక్షణకు హాజరయ్యేలా పంచాయతీ కార్యదర్శులు చొరవ చూపాలన్నారు.

తురిమెర్లలో ఇరువర్గాల ఘర్షణ

కావలి: దగదర్తి మండలం తురిమెర్లలో రెండు కుటుంబాల మధ్యన పాత వివాదాల నేపథ్యంలో తలెత్తిన ఘర్షణ సోమవారం ఉద్రిక్త పరిస్థితులకు దారి తీసింది. పోలీసుల కళ్లేదుటే సుమారు గంటపాటు జరిగిన ఘర్షణలో ఇద్దరు మహిళలు, వారి బంధువైన ఇంటర్ విద్యార్థి గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన రాధ అనే మహిళ వివాహానంతరం రేగడిచెలికలో నివాసం ఉంటోంది. సోమవారం ఆమె తల్లిని చూసేందుకు తురిమెర్లకు రాగా పాత వివాదాల నేపథ్యంలో సమీప బంధువులైన గట్టాల పద్మ, రాధయ్య, మేకల శ్రీకాంత్, మేకల మంజుల, అల్లం వెంకమ్మ, అల్లం శ్రీకాంత్ గొడవకు దిగారు. ఈ క్రమంలో రాధతో పాటు ఆమె తల్లి, బంధువైన ఇంటర్మీడియట్ విద్యార్థిపైన దాడికి దిగారు. కాళ్లు, చేతులతో విచక్షణా రహితంగా దాడి చేయడంతో రాధ, ఆమె తల్లి గాయపడ్డారు. ఇనుపరాడ్‌తో దాడి చేయడంతో ఇంటర్మీడియట్ విద్యార్థి తలకు గాయాలయ్యాయి. బాధితులు నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. గొడవ జరిగే సమయంలో దగదర్తికి చెందిన ఇద్దరు కానిస్టేబుళ్లు ఘటనా స్థలంలో ఉండి అడ్డుకోకుండా చోద్యం చూస్తూ ఉండిపోయారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.

వర్షపు నీరు నిల్వ లేకుండా చర్యలు



అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలోని వైఎస్సార్ విగ్రహం వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డుపై వర్షపునీరు నిల్వకుండా చర్యలు తీసుకుంటామని ఆర్‌అండ్‌బీ జేఈ అమానుల్లాఖాన్ తెలిపారు. వైఎస్సార్ విగ్రహం వద్ద ఏఎస్‌పేట– ఆత్మకూరు రోడ్డు చిన్నపాటి వర్షం పడినా జలమయమవుతూ ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను ప్రజలు సర్పంచ్ దృష్టికి తీసుకెళ్లడంతో పాటు పత్రికల్లోనూ కథనాలు వచ్చాయి. సర్పంచ్ విజ్ఞప్తి మేరకు ఆర్‌అండ్‌బీ జేఈ రోడ్డును పరిశీలించారు. సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తామని తెలిపారు. ఆయన వెంట నాయకులు జిలానీ, తదితరులు ఉన్నారు.

10 మండల సర్వసభ్య సమావేశం

జలదంకి: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఈ నెల 10న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బ్రహ్మయ్య సోమవారం తెలిపారు. ఎంపీపీ గోచిపాతల వెంకటరమణయ్య అధ్యక్షతన జరిగే సమావేశంలో మండలాభివృద్ధిపై చర్చించనున్నట్లు చెప్పారు. అన్ని శాఖల మండలాధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరుకావాలని కోరారు.

కొండబిట్రగుంటపై గాడి తప్పుతున్న నిర్వహణ



కొండబిట్రగుంట బిలకూట క్షేత్రం

బిట్రగుంట: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కొండబిట్రగుంట బిలకూట క్షేత్రం ఆలయ వ్యవహారాల్లో ప్రైవేట్ వ్యక్తుల జోక్యం కారణంగా భక్తులు తరచూ ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా నెల్లూరుకు చెందిన భక్తులకు, స్థానిక టీడీపీ నాయకుడికి మధ్య జరిగిన వివాదం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. నెల్లూరు నుంచి వస్తున్న భక్తుల కారు వెళ్లే విషయంలో స్థానిక టీడీపీ నాయకుడు విజయ్ అభ్యంతరం తెలపడంతో కారులోని భక్తులు వీడియో తీసి వైరల్ చేశారు. కొండపైన రద్దీని క్రమబద్ధీకరించాల్సిన యంత్రాంగం తమ విధులు పక్కన పెట్టి ప్రైవేట్ వ్యక్తులకు పెత్తనం అప్పగించడంపై కూడా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. టీడీపీ నాయకుడికి పెత్తనం అప్పగించిన ఈవోపై చర్యలు చేపట్టాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. ఒకవేళ టీడీపీ నాయకుడికి, ఆలయ అధికారులకు సంబంధం లేకుంటే భక్తులను ఇబ్బంది పెట్టినందుకు ఆలయ అధికారులు వెంటనే సదరు వ్యక్తిపై పోలీసులకు ఫిర్యాదు చేసి మళ్లీ ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పంచాయతీల పాలనలో భాగస్వాములు కావాలి



ఆత్మకూరులో శిక్షణకు హాజరైన ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులతో ఎంపీపీ, ఎంపీడీఓ



ఉదయగిరిలో శిక్షణ ఇస్తున్న ఈఓపీఆర్డీ షేక్ కరిముల్లా

ఆత్మకూరురూరల్: గ్రామ పంచాయతీల పాలనలో ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు భాగస్వాములు కావాలని ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీనివాసరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులకు రెండ్రోజుల పాటు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమంలో సోమవారం వారు మాట్లాడారు. పంచాయతీల్లో పారిశుద్ధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణ, ఆర్థిక వ్యవహారాలు, పంచాయతీ ఆస్తుల పరిరక్షణ, తదితర అంశాల్లో తమ వంతు బాధ్యతలను నిర్వహించాలని కోరారు. తొలుత గాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈఓపీఆర్డీ డేవిడ్, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

ఉదయగిరి: స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉపసర్పంచులు, వార్డు సభ్యులకు ఈఓపీఆర్డీ షేక్ కరిముల్లా సోమవారం శిక్షణ ఇచ్చారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి సంబంధించి సూచనలు, సలహాలు అందజేశారు. పంచాయతీ కార్యదర్శులు నాగుర్‌బీ, ఆదోనీ శ్రీనివాసులు, చంద్రశేఖర్‌రెడ్డి, ఆవుల వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

విత్తన శుద్ధితో తెగుళ్లు దూరం



విత్తనశుద్ధిపై అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్త విజయ్‌కుమార్

చేజర్ల: విత్తన శుద్ధితో తెగుళ్లను దూరంగా ఉంచవచ్చని నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ డీ విజయ్‌కుమార్‌నాయక్ పేర్కొన్నారు. మండలంలోని చేజర్ల, చిత్తలూరు, వావిలేరు గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించారు. మినుము సాగు చేసే రైతులకు విత్తనశుద్ధిపై అవగాహన కల్పించారు. గత రెండు రోజులుగా కురిసిన వర్షాలకు మినుము సాగుకు సిద్ధమవుతున్న రైతులకు పీయూ 37 రకం విత్తనాలను వేసుకోవాలని సూచించారు. కేజీ మినుము విత్తనాలను 5 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్‌తో శుద్ధి చేయడం వల్ల రసం పీల్చే పురుగులు, తెల్లదోమ, తామరపురుగులు, పేనుబంక ద్వారా వ్యాపించే వైరస్ తెగులు, బొబ్బర తెగులు, మొవ్వకుళ్లు తెగులు దరిచేరవని తెలిపారు. మినుము పంట చుట్టూ జొన్నా లేదా సజ్జను 4 నుంచి 5 వరుసలు వేసుకోవడంతో పాటు పంట పసుపు, నీలి రంగు జిగురు అట్టలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా తెగుళ్ల నుంచి పంటను కాపాడుకోవచ్చని వివరించారు.

దోమల నియంత్రణకు ఫాగింగ్

సాక్షి ఎఫెక్ట్..



ఫాగింగ్ చేపడుతున్న మున్సిపల్ సిబ్బంది

ఆత్మకూరు: పట్టణంలో దోమల నియంత్రణకు మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. మున్సిపాలిటీలో ఫాగింగ్ యంత్రాలు ఉన్నా మరమ్మతులకు గురయ్యాయి. వాటికి మరమ్మతులు చేయించి ఫాగింగ్ చేపట్టాల్సిన మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం వహించడంతో దోమల బెడదతో ప్రజలు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. ఈ విషయమై 'సాక్షి'లో 'బాబోయ్ దోమలు' శీర్షికన సోమవారం కథనం ప్రచురించడంతో మున్సిపల్ అధికారులు స్పందించారు. ఫాగింగ్ యంత్రాలకు మరమ్మతులు చేయించారు. సోమవారం రాత్రి ఫాగింగ్ చేపట్టి దోమల నియంత్రణకు చర్యలు చేపట్టారు.

శక్తి స్వరూపిణి.. అభయ ప్రదాయిని



బిట్రగుంట: మహాచండీగా రాజరాజేశ్వరీదేవి



వరికుంటపాడు : స్కందమాతగా మానసాదేవి



ఆత్మకూరు: గజలక్ష్మిగా కన్యకాపరమేశ్వరి



కలిగిరి: అన్నపూర్ణగా భద్రకాళి



సీతారామపురం: అన్నపూర్ణగా ఇష్టకామేశ్వరి

ఆత్మకూరు: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదోరోజు సోమవారం శక్తి స్వరూపిణి వివిధ రూపాల్లో భక్తులకు అభయమిచ్చింది. పట్టణంలోని శివాలయంలో గాయత్రీదేవిగా అన్నపూర్ణాదేవి దర్శనమిచ్చింది. కాశీనాయన ఆశ్రమంలో సరస్వతిగా, దుర్గాదేవి ఆలయంలో రాజరాజేశ్వరిగా, జ్వాలాముఖి ఆలయంలో అన్నపూర్ణగా, కన్యకాపరమేశ్వరి ఆలయంలో గజలక్ష్మిగా దర్శనమిచ్చింది.

సీతారామపురం: ఘటిక సిద్దేశ్వరంలో ఇష్టకామేశ్వరి అమ్మవారు అన్నపూర్ణాదేవి, సీతారామపురంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో మోహినీ అలంకారం, నారాయణప్పపేటలోని విజయ కనక దుర్గాదేవి ఆలయంలో మహాచండీగా అమ్మవారు భక్తులను కటాక్షించారు.

కలిగిరి: తెల్లపాడులోని భద్రకాళి ఆలయంలో అన్నపూర్ణాదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చింది. మార్లెల్ల మహాదేవరెడ్డి, మమత దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

చేజర్ల: బోడిపాడులోని మహాలక్ష్మి ఆలయంలో గజలక్ష్మిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చింది. బత్తల వేణు, మనోజ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.



వరికుంటపాడు: కామాక్షిగా నాగారప్పమ్మ



చేజర్ల: బోడిపాడులో గజలక్ష్మిగా మహాలక్ష్మి

వరికుంటపాడు: తూర్పురొంపిదొడ్లలోని మానసాదేవి ఆలయంలో స్కందమాతగా, వరికుంటపాడులోని నాగారప్పమ్మ ఆలయంలో కామాక్షిదేవిగా అమ్మవారు భక్తులను అనుగ్రహించారు.

బిట్రగుంట: విశ్వనాథరావుపేటలోని కోదండరామస్వామి ఆలయంలో రాజరాజేశ్వరి అమ్మవారు మహాచండీ అలంకారంలో దర్శనమిచ్చింది. చలమయ్య, తనూజ, అలహరి మాల్యాద్రి, పద్మ, లక్ష్మీ కాంత్, సురేష్, రవీంద్రబాబు, సుజాత ఉభయకర్తలుగా వ్యవహరించారు.



ఉదయగిరిలో మహాచండీ అలంకరణ

సంగం: స్థానిక సంగమేశ్వరస్వామి ఆలయంలో కామాక్షితాయి అమ్మవారు సంతానలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

మర్రిపాడు: మర్రిపాడు సెంటర్‌లో రాజరాజేశ్వరి అమ్మవారు సంతానలక్ష్మిగా దర్శనమిచ్చారు. ఉభయకర్తలుగా శివా, సుగుణ వ్యవహరించారు.

ఉదయగిరి: పట్టణంలోని పార్వతీ పరమేశ్వరస్వామి, సంతానలక్ష్మి ఆలయాల్లో మహాచండీ అలంకారంలో అమ్మవారు భక్తులకు అభయమిచ్చారు.



సీతారామపురం: మోహినీగా వాసవీమాత



ఆత్మకూరు: శివాలయంలో గాయత్రి అలంకారం



ఆత్మకూరు: కాశీనాయన ఆశ్రమంలో..



ఆత్మకూరు: అన్నపూర్ణగా జ్వాలాముఖి



మర్రిపాడులో సంతాన లక్ష్మి అలంకారం



సంగం: సంతాన లక్ష్మిగా కామాక్షితాయి